భయంతో
ఉన్నవాళ్లు ఏదీ
సాధించలేరు
- రవీంద్రనాథ్ ఠాగూర్

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...

శనివారం, 24 జనవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 72

## ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ ఆత్మపరిశీలన

# చేసుకోవాలి

**హైదరాబాద్, జనవరి 23:** మాజీ మంత్రి, బీఆర్ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ. కేటీఆర్ తనపై వ్యక్తిగత హననం చేస్తున్నారని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. రాజ్యాంగం ప్రకారమే విచారణ జరుగుతోందని. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే, అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకునేవాళ్లమని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంపై కేటీఆర్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు.



బీఆర్ఎస్‌పై విమర్శలు.ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లే అని పీసీసీ చీఫ్ తెలిపారు. కేటీఆర్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని వ్యాఖ్యానించారు. 'బట్ట కాల్చి మీద వేసి పారిపోతామంటే కుదరదు. అలీ బాబా 420 దొంగల మాదిరి కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసింది. స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్ బీఆర్ఎస్ అని తీవ్రంగా విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆగిపోకుండా 'ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం' అంటూ కేటీఆర్ రాగాలు తీస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.ఉద్యమ కేసులతో పోల్చొద్దు.ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమని, తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే సమాధానం లేదని మహేశ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రమైందని, దీన్ని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని మహేశ్ గౌడ్ అభిప్రాయపడ్డారు. బీఆర?స్ హయంలో కేవలం మూడు నెలల్లో 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని, తన మిత్రుడి ఫోన్ కూడా ట్యాప్ అయిందని వెల్లడించారు.కవిత ఎపిసోడ్‌పై స్పందిస్తూ.'కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తా. కేసీఆర్ కుటుంబంలో తగాదా లకు మూలం వాటాల పంపకంలో తేడా. కవిత ఇప్పటికైనా నిజాలు మాట్లాడుతున్నందుకు స్వాగతిస్తున్నాం' అని చెప్పారు. అలాగే ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మార్పు ఉండదని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు.

# కేరళలోనూ గుజరాత్ సీన్ రిపీట్

## - త్వరలో అధికార మార్పు తప్పదు


**గుజరాత్ :**గుజరాత్ లో కేవలం ఒక నగరంలో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం, ఆ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వరకు వెళ్లిందని, ఇప్పుడు కేరళలోనూ అదే జరుగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవల తిరువనంతపురం మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలే అందుకు నిదర్శనమని చెప్పారు. కేరళ ప్రజలు బీజేపీపై విశ్వాసంతో ఉన్నారని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేరళలో ప్రభుత్వ మార్పు తప్పదని విశ్వాసం వ్యక్తం చేశారు. తిరువనంతపురం నుంచి అమృత్? భారత్? సూపర్?ఫాస్ట్? రైలును ప్రధాని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేరళ సీఎం పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ పాల్గొన్నారు. ఇక్కడ నేను ఓ కొత్త ఆశను చూస్తున్నాను. మీలోని ఉత్సాహం చూస్తుంటే, కేరళలో నిజంగానే మార్పు వచ్చే అవకాశం ఉందని మాకు విశ్వాసాన్ని ఇస్తోంది. 1987కి ముందు, గుజరాత్‌లో బీజేపీ ఒక సాధారణ పార్టీగా ఉండేది. 1987లో మొదటిసారిగా బీజేపీ అమ్దావాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను గెలుచుకుంది. సరిగ్గా ఈ రోజు మీరు తిరువనంతపురంలో గెలిచినట్లే. అక్కడి నుంచి గుజరాత్?లో ప్రారంభమైన పరంపరలో, ప్రజలు మా పనిని చూశారు. మా పార్టీ ప్రవర్తనను అంచనా వేశారు. దాని ఫలితంగా, గత అనేక దశాబ్దాలుగా అక్కడి ప్రజలు మాకు అవకాశాలు ఇస్తూనే ఉన్నారు. ఇదంతా ఒక నగరంతో ప్రారంభమైంది.



కేరళలో కూడా, ఇది ఒక నగరంతోనే ప్రారంభమైంది. అందుకే నేను చెబుతున్నాను. కేరళ ప్రజలు బీజేపీపై విశ్వాసంతో మాతో జతకట్టారు.– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రివికసిత్ భారత్ లక్ష్యం వైపు యావత్ దేశం సమష్టిగా పనిచేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్?లో మన నగరాలు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతోందని వెల్లడించారు. దీనివల్ల దేశవ్యాప్తంగా వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఫుట్?పాత్ వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుంది" అని మోదీ అన్నారు.

## పార్లమెంటును రద్దు చేసిన ప్రధాని

**- 60 ఏళ్లలో ఇదే తొలిసారి!**



**జపాన్:** పార్లమెంటును రద్దు చేశారు ప్రధానమంత్రి తకాయిచి. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేవలం మూడు నెలలకే సనాయె తకాయిచి కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ప్రతినిధుల సభను రద్దు చేసి, ఫిబ్రవరి 8న ముందస్తు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లుగా ప్రకటించినట్లు స్థానిక మీడియా సంస్థ పేర్కొంది. తన ఆర్థిక భద్రతా విధాన ఎజెండాకు ప్రజల మద్దతు కోరుతూ ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 465 మంది సభ్యులున్న దిగువ సభను రద్దు చేసి, ఈ నిర్ణయం తీసుకోవడం 60 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం

# మా టార్గెట్ ఇదే

## – తెలంగాణ అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కీలక వివరణ!

**హైదరాబాద్, జనవరి 23:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఒక స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఏస్ టెక్ 2026 ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను వివరించారు. 2047 సంవత్సరం నాటికి మన రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని తెలిపారు.హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్?లో సుమారు 5.75 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను సాధించడం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని చెప్పారు. ముఖ్యంగా ఐటీ, ఫార్మా రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, దీనివల్ల యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు.రాష్ట్ర రవాణా ముఖచిత్రాన్ని మార్చేందుకు రీజినల్ రింగ్ రోడ్డు ఒక గేమ్ చేంజర్ కాబోతోందని కోమటిరెడ్డి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డును, రీజినల్ రింగ్ రోడ్డును కలుపుతూ మొత్తం 39 రేడియల్ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా, నగర శివారు ప్రాంతాలు కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆయన చేశారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం ఎంత బలంగా ఉందంటే, ఇటీవల జరిగిన వేలంలో ఎకరం భూమి ధర 174 కోట్లు పలికిందని ఆయన గుర్తు చేశారు.



## సీఎం అధ్యక్షతన ఎస్ఎల్‌బీసీ

# సమావేశం

**అమరావతి, జనవరి 23:** దావోస్ పర్యటన ముగించుకుని (శుక్రవారం) ఆంధ్రప్రదేశ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. వచ్చీరాగానే నేరుగా సచివాలయానికి చేరుకుని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిట సమావేశానికి హాజరయ్యారు. సీఎం అధ్యక్షతన జరిగిన 233, 234వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక అమలు, వ్యవసాయ రుణాలు, ఎంఎస్ఎం ఈలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు సీఎం. వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా ఇప్పటి వరకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.2.96 లక్షల కోట్ల మేర రుణాలను బ్యాంకర్లు అందజేశారు. అలాగే కౌలు రైతులకు రూ.1,490 కోట్ల మేర వ్యవసాయ రుణాలిచ్చారు. ఎంఎ స్ఎంఈలకు రూ. 95,714 కోట్ల మేర రుణాలను బ్యాంకర్లు జారీచేశారు. ఈ సమావేశంలో అమరావతిని ఫైనాన్షియల్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. రాజధానిలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) ఏర్పాటుపై బ్యాంకర్లతో చంద్రబాబు సమాలోచనలు జరిపారు.



# సప్త సముద్రాల అవతల

## దాక్కున్నా వదలం

**హైదరాబాద్, జనవరి 23:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆరస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిట్ విచారణకు హాజరైన క్రమంలో పోలీసుల అత్యుత్సాహంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రపూరి తంగా, ఉద్దేశపూర్వకంగా తమపై కేసులు పెట్టారని తెలిపారు. ఈ కేసులో కేటీఆర్ విచారణకు హాజరయ్యా రని.. రేవంత్ రెడ్డిని కూడా ఫోన్ ట్యాపింగ్‌పై విచారించాలని డిమాండ్ చేశారు.జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లకుండా బీఆరస్ నాయకులపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, క్రాంతి నాయక్, ఇతర బీఆర?స్ నాయకులు జూబ్లీహిల్స్‌లోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిని హరీశ్‌రావు నిలదీశారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు.కావాలనే రిటైర్మెంట్ దగ్గరగా ఉన్న అధికారులను సిట్ లో పెట్టి మా మీద ప్రయోగాలు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారులు అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే, ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. చట్టాన్ని అతిక్రమించినా, న్యాయబద్ధంగా వ్యవహరించకపోయినా, తప్పుడు లీకులు ఇచ్చినా ఆ పోలీసులను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. అంతకు అంత అనుభవిస్తారు..



## ఏ అక్రమాలకు పాల్పడలేదు

## మానసిక క్షోభకు గురిచేశారు

**హైదరాబాద్, జనవరి 23:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సిట్ ఎదుట విచారణకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా నార్సింగి నివాసం నుంచి మాజీ మంత్రి హరీశ్ రావుతో కలిసి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు కేటీఆర్. సిట్ విచారణకు బయల్దేరే ముందు మీడియాతో మాట్లాడిన ఆయన.. గత పదిహేనేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కోసం నిబద్ధతతో పనిచేశానని, కేసీఆర్ నాయకత్వంలో ఎలాంటి టైమ్ పాస్ రాజకీయాలు చేయలే దన్నారు. కేసీఆర్ ఏ బాధ్యత అప్పగించినా శక్తివంచన లేకుండా పనిచేశామని తెలిపారు. ప్రత్యర్థుల కుటుంబాలను, పిల్లలను రాజకీయాల్లోకి లాగలేదని, ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టి వేధిం చలేదని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు.రోజుకో కొత్త డ్రామా.మేనిఫెస్టోలో చెప్పని హామీలను కూడా నెరవేర్చిన నాయకుడు కేసీఆర్ అని బీఆరస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. రైతు బంధు, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్.. ఇలా ఎన్నో గొప్ప కార్యక్రమాలు ప్రజల కోసం చేశామని చెప్పారు. గత రెండే ళ్లుగా తెలంగాణ.. పిచ్చోడి చేతిలో రాయిలా మారిపోయిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సత్తా రేవంత్ ప్రభుత్వానికి లేదన్నారు. అందులో భాగంగానే కాళేశ్వరం, గొర్రెల స్కామ్, ఫార్ములా ఈ, ఫోన్ ట్యాపింగ్ డ్రామాలా డుతున్నారంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నాపై వ్యక్తిత్వ హననం జరుగుతోంది.'నా అంతరాత్మ సాక్షిగా చెబుతు న్నాను. నేను ఏనాడూ అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడలేదు. నా మీద తీవ్రమైన వ్యక్తిత్వ హననం జరుగుతోంది. నన్ను ఏదో డ్రగ్స్ కేసులోనో, హీరోయిన్లతో సంబంధాల కేసుల్లోనో ఇరికించాలని చూశారు. నన్నే కాకుండా నా కుటుంబాన్ని, పిల్లలనూ మానసిక క్షోభకు గురి చేశారు. అయినా నేను ఎవరికీ భయపడలేదు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ విషయంలో నన్ను విచార ణకు పిలిచారు. నేను వెళ్తాను. మా ప్రభుత్వం ఏం తప్పు చేసిందో, అసలు ఎక్కడ తప్పు జరిగిందో వాళ్లు సమాధానం చెప్పాలి. గత రెండేళ్లుగా ఒక సీరియల్‌లాగా లీకులు ఇస్తూ నా మీద వ్యక్తిత్వ హననం చేస్తున్నారు' కేటీఆర్ చెప్పారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ కార్యాలయం ‾ విచా రణకు బయల్దేరి వెళ్లారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రి హరీశ్ రావు కూడా జూబ్లీహిల్స్ పీఎస్‌కు వెళ్లారు.



## ఏఐ ఆవిష్కరణల

# అమలుకు 'ఐకమ్'

## - దావోస్ వేదికగా ఆవిష్కరించిన సీఎం రేవంత్

**దావోస్:** ఇప్పటి వరకు ఏఐ(కృత్రిమ మేధ) అంటే ప్రయోగాలు, స్టార్టప్ డెమోలు, పైలట్ ప్రాజెక్టులకు పరిమితమైంది. ప్రస్తుతం ప్రపం చం ఒక కీలక మలుపులో నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?ను బాధ్యతాయుతంగా, విశ్వసనీ యంగా ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్లి ఏవిధంగా అమలు చేయా లన్నదే అసలైన సవాల్. దీనికి పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న భారత్‌లోనే తొలి ఎకోసిస్టమ్ ఆధారిత ఓపెన్ ఇన్నోవేషన్ సంస్థే 'ఐకమ్'.ఇది బిగ్ డేటా వినియోగం, ఏఐ నైపుణ్యాల విస్తృత అభివృద్ధి, ప్రపంచ స్థాయి స్టార్టప్‌లకు ప్రోత్సాహం, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక వసతులతో బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రపంచ వేదికగా నిలబెడుతుంది అని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి స్పష్టంచేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఐకమ్‌ను రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఐకమ్ వ్యవస్థాపక సీఈవో ఫణి నాగార్జున పాల్గొన్నారు.ఇదొక శాశ్వత వ్యవస్థ : ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రయోగాలతోపాటు ఆయా ఆవిష్కరణల అమలుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రపంచం ఏఐ పైలట్ దశ నుంచి విస్తృత అమలు దశలోకి మారుతున్న తరుణంలో బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కృత్రిమ మేధను ఉపయోగించుకునే వేదికగా తెలంగాణను మేం ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని వివరించారు.ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు ఒక ప్రయోగ వేదికగా తెలంగాణను నిలిపే లక్ష్యంతో రూపొందించిన తొలితరం సంస్థగా 'ఐకమ్'



నిలుస్తుందని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనకు వ్యూహాత్మక దిశ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐకమ్ ద్వారా అది సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ ఉద్యోగాలను సృష్టిస్తుందని రేవంత్ వివరించారు. భారత్‌ను టెక్నాలజీ వినియోగదారుడిగానే కాకుండా సృష్టికర్తగానూ మారుస్తుందని' అని సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు."ప్రపంచవ్యాప్తంగా అనేక ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పాలసీలున్నాయి. పలు దేశాలు ఇప్పటికే ఏఐ మిషన్‌లను ప్రకటించాయి. వాటిలో చాలావాటికి సాధారణ లోపం ఒకటుంది. అదే అమలుకు అవసరమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం. 'ఐకమ్' ఆ లోపాన్ని భర్తీ చేస్తుంది. ఇది ఒక డిపార్ట్‌మెంట్ కాదు ఏకీకృత ఎకోసిస్టమ్. ఇది ఒక ల్యాబ్ కాదు విస్తృత జనాభా ప్రాతిపదికన సేవలందించే వేదిక. కృత్రిమ మేధపై ప్రయోగాల దశను దాటి జనాభా స్థాయికి తగ్గట్టుగా ఈ సాంకేతికతను అమలు చేసే సామర్థ్యాన్ని కలిగిన భారత సంస్థగా ఇది గుర్తింపు పొందుతుంది" – రేవంత్ రెడ్డి, ముఖ్య మంత్రిఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల వరకు : అనంతరం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల దాకా స్పష్టమైన అమలు మార్గాన్ని 'ఐకమ్' అందిస్తుందని వివరించారు. ప్రభుత్వ వ్యవస్థలో ఉండి కూడా స్వయంప్రతిపత్తితో పనిచేసే దీని నిర్మాణం ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# శ్రీకృష్ణవేణి పాఠశాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు




**చేగుంట జనవరి 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలోనిశ్రీ కృష్ణవేణి పాఠశాల లో వసంత పంచమిని పురస్కరించుకొని సరస్వతీ పూజ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది.ఈ యొక్క అక్షరాభ్యాస కార్యక్రమంలో పలువురు తల్లిదండ్రులు వారి పిల్లలని తీసుకొచ్చి సరస్వతి పూజ తో పాటు అక్షరాభ్యాసం చేయించడం జరిగింది . ఈ వసంత పంచమి రోజు యొక్క విశిష్టత సరస్వతీ మాత యొక్క పూజ ప్రాముఖ్యతను అర్చకులు శివా చార్యులు విద్యార్థులకు తల్లిదండ్రులకు క్లుప్తంగా వివరించడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ద్యావ రేణుక లింగమూర్తి ,డైరెక్టర్ పులబోయిన నాగరాజు, ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థుల బృందం పాల్గొన్నారు

# రిషి మెమోరియల్ స్కూల్లో సామూహిక అక్షరాభ్యాసం






**చేగుంట జనవరి 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల కేంద్రంలోని రిషి మెమోరియల్ స్కూల్లో వసంత పంచమి పునస్కరించుకొని సామూహి క అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించబడినది. వాసుదేవ శర్మ పంతులు సరస్వతి అమ్మవారి దగ్గర పలకలు పెట్టి పూజ చేసిన అనంతరం వచ్చిన అతిధుల చేత పిల్లలకు ఇచ్చి అక్షరాభ్యాసశీ చేయించినారు. గ్రామ సర్పంచ్ సంద్రుగుస్రవంతి - సతీష్, ఉపసర్పంచ్ మహ్మద్ రఫీక్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి, సంద్రుగు శ్రీకాంత్, పిల్లలను వాళ్ల ఒడిలో కూర్చోబెట్టి పలక మీద పదాలను రాయించి అక్షరాభ్యాసం చేయించినారు.వారు మాట్లాడుతూ స్కూల్ మేనేజ్మెంట్ ఈరోజు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయం పిల్లలు మీరందరూ మంచిగా చదువుకొని ఉన్న స్థాయిలో ఎదగాలని ఆశీర్వాదం ఇచ్చారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ మాట్లాడుతూ వసంత పంచమి రోజు శ్రీ సరస్వతి మాత జన్మించిన రోజు ఈ విశిష్ట పర్వదినమున అక్షరాభ్యాసము చేయించుకున్న చిన్నారుల్లో గ్రహణశక్తి, జ్ఞాపకశక్తి, మేధాశక్తి పెంపొంది చక్కటి విద్యావంతులు కాగలరని,విద్యతో పాటు సంస్కారం పెద్దల పట్ల గౌరవం ఇవ్వాలని వివరించారు. వర్గల్ సరస్వతి ఆలయం నుంచి తీసుకువచ్చిన ఫలకాలుఉచితంగా పంపిణీ చేశామని అతి చేరువలో తక్కువ ఖర్చుతో మంచి విద్యను అందించిన పాఠశాల రిషి మెమోరియల్ పాఠశాల అని ఛైర్పర్సన్ సుష్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ మహ్మద్ రఫీక్, అయిత పరంజ్యోతి, సంద్రుగు శ్రీకాంత్, స్వర్గం సిద్దిరాములు విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**- సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా**



**చేగుంట జనవరి 23, మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం చందాయిపేట్ గ్రామం లో ఓటర్ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు ఊర్మిళ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ నగేష్ గుప్తా, సెక్రటరీ కృష్ణ, విద్యార్థుల చేత ఓటర్ల ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని,ఎటువంటి ప్రభావాలకు,లోను కాకుండా, కుల, మత,వర్గ, భాష భేదాలు లేకుండా, ప్రశాంత వాతావరణంలో రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుగా భావించి అందరూ వినియోగించుకోవాలన్నారు అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ, సర్పంచ్ మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ పబ్బ నగేష్ గుప్తా, పంచాయతీ సెక్రటరీ కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఫీల్డ్ అసిస్టెంట్ బుడ్డ ప్రదీప్, అంగన్వాడీ టీచర్, ఆశవర్కర్ లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వడియారం గ్రామంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు





**చేగుంట జనవరి 23 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం వడియారం గ్రామంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు చేగుంట ఉపసర్పంచ్,చేగుంట మండల బిజెపి నాయకులు జయంతి వేడుకలలో పాల్గొనడం జరిగిన ది వారు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ జనవరి 23 1897 కటక్ లో జన్మించాడు. తల్లిదండ్రులు జానకి నాథ్ బోస్ ప్రభావతి దేవి.భారత దేశ స్వాతంత్ర సమరయోధుడు ఆయన బ్రిటిష్ వారిని సాయుధ పోరాటం ద్వారా తరిమికొట్టాలని నమ్మాడు జైహింద్ నినాదం ఇచ్చాడు. ఆగస్టు 18 1945 విమాన ప్రమాదంలో మరణించినట్లు మనకు తెలుసు కానీ ఆయన మరణం ఇప్పటివరకు ఒక రహస్యంగానే ఉన్నది.గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు నేతాజీగా పిలవబ డ్డారు సైన్యాని స్తాపించి మీరు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్రం ఇస్తాను అనే నిదాదంతో పోరా రాడు ఈ కార్యక్రమంలో చేగుంట ఉపసర్పంచ్ మహ్మద్ రఫీ బీజేపీ నాయకులు కరణం గణేష్ చిలకమర్రి గోవింద్ వడియారం పాలకవర్గ సభ్యులు శ్రావణ్ కుమార్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు సంఘ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది

# ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

**ప్రతి ఓటు దేశ భవిష్యత్తు**
**మెదక్ జిల్లా అదనపు ఎస్పీ. మహేందర్**





**మెదక్ జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి** జనవరి 25న జరుపుకునే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని, ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్?లో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎస్. మహేందర్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై పోలీస్ సిబ్బందిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగి ంచుకోవాలని సూచించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారు ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించడం ద్వారా యువతకు ప్రజాస్వామ్య ంలో భాగస్వామ్యం కల్పించారని గుర్తుచే శారు. యువత భాగస్వామ్యం వల్ల ప్రజాస్వా మ్యానికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు.ఓటు హక్కు ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని, ఎన్నికల సమయంలో మతం, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుతంగా, నిస్పక్షపా తంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచిం చారు.ఈ కార్యక్రమం చివరగా పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో కింది విధంగా ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు:భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై సంపూర్ణ విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయా లను, స్వేచ్ఛయుత, నిష్పక్షపాత మరియు ప్రశాంత ఎన్నికల గౌరవాన్ని కాపాడుతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఏ విధమైన ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో మెదక్ ఏఆర్ డియస్పి రంగా నాయక్, ఆర్?ఐ శైలేందర్, ఆర?స్సైలు నరేష్, హరీష్, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# టీ స్టాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు.





**మెదక్ రూలర్ జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
మెదక్ మండలం మంబోజిపల్లి వద్ద మెదక్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఆదిల్ పాషా నూతన టీ స్టాల్ ను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ యువకులు వివిధ వ్యాపార రంగాల్లో రానించే విధంగా స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవడం పట్ల ఆయన నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఆదిల్ పాషా వాళ్ల తండ్రి అల్తాఫ్ పాషా ఎమ్మెల్యేను షాలోతో సత్కరించారు ఈ కార్యక్రమంలో టీ స్టాల్ నిర్వాహకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, రిజ్వాన్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆదర్శ గ్రామాలుగా గ్రామపంచాయతీలను తీర్చిదిద్దే బాధ్యత సర్పంచ్లు దేనని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.







**మెదక్ టౌన్ జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
తెలంగాణ ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఆవరణలో సర్పంచులు మొదటి విడత శిక్షణ ముగింపు కార్యక్రమంలో డిపిఓయాదయ్య, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, సంబంధిత సర్పంచులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూగ్రామాల అభివృద్ధి లో సర్పంచ్ ల పాత్ర చాల ముఖ్య మని, గ్రామాలు అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లాలని పంచాయతీ పాలన విధులు,అభివృద్ధి కి సంబందించిన శిక్షణ కార్యక్రమములో అనేక అంశాలపై అవగాహన పెంపొందించామని తద్వారా గ్రామాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు.. సర్పంచ్ లు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు.పంచాయతీ రాజ్ చట్టం లో సర్పంచ్ లకు పొందు పరిచిన అధికారాలు, విధులు తదితర అంశాల ను శిక్షణ లో ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పాఠశాల ల నిర్మాణం పనులు, సన్న బియ్యం పంపిణీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామం లో అమలు పరచాలని అన్నారు.గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడడం లాంటి ప్రధాన అంశాల్లో సర్పంచ్ లు చురుకుగా పని చేయాలిసిన అవసరం ఉందన్నారు.ప్రతీ గ్రామం శుభ్రం గా ఉంచాలన్నారు.పంచాయతీ రాజ్ చట్టం లోని గ్రామ పాలన విధులు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, గ్రామాభివృద్ధి పథకాలు, ఆదర్శ గ్రామపంచాయతీ ల నిర్మాణం తద్యమని తెలిపారు.అనంతరం శిక్షణ నిమిత్తం నూతన సర్పంచులకు సర్టిఫికెట్స్ అందించారు.ఈ కార్యక్రమం లో డి ఎల్. పి ఓలు సాయిబాబా, మెదక్ సురేష్ బాబు,శివంపేట ఎంపీఓ తిరుపతిరెడ్డి, నర్సాపూర్ ఎంపీఓ మహమ్మద్ మోజం హుస్సేన్ లు, జిల్లా పంచాయతీ ఆఫీస్ సిబ్బంది, ప్రవీణ్ కుమార్ , హరీష్ , లతీఫ్ నూతన సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత వారోత్సవాల్లో ‘ అలైవ్ అరైవ్’కార్యక్రమం 8వ రోజు అవగాహన

- పరిశ్రమల ప్రాంతాల్లో రోడ్డు భద్రతకు గురించి కార్మికులు, డ్రైవర్లకు అవగాహన
- ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి
- రోడ్డు ప్రమాదాలు ఒక్క కుటుంబానికే కాదు, సమాజానికే తీరని నష్టం కలిగిస్తాయి.
- మనోరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటిసి - కంపెనీలో రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం మెదక్ జిల్లా అదనపు ఎస్పీ శ్రీ. ఎస్ మహేందర్








**మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**శుక్రవారం రోజు మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డి.వి శ్రీనివాస్ ఆదేశానుసారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐటిసి కంపెనీలో భారీ ఎత్తున రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ . ఎస్ మహేందర్ గారు ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ . ఎస్ మహేందర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత వారోత్స వాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న “ అరైవ్ – అలైవ్ “ కార్యక్రమంలో భాగంగా 8వ రోజు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన పరిశ్రమల ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. వాహనాలను వేగంగా నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంలో నిర్లక్ష్యం వంటి కారణాల వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్మికులు విధులు ముగించుకుని సురక్షితంగా ఇంటికి చేరడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. అరైవ్ –అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించడమే లక్ష్యంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారుఉద్యోగం ఎంత ముఖ్యమోౌఆ ఉద్యోగి ప్రాణం అంతకన్నా విలువైనది. వేగం కాదు జీవితం గెలవాలని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మోటార్ సైకిళ్ల ద్వారానే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. అందువల్ల రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ చిన్న వయస్సు నుంచే బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ఐఎస్?ఐ మార్క్ ఉన్న హెల్మెట్ మాత్రమే వినియోగించాలని, హెల్మెట్ స్ట్రాప్?ను తప్పనిసరిగా పెట్టుకో వాలని తెలిపారు. హెల్మెట్ స్ట్రాప్ పెట్టుకోనట్లయితే హెల్మెట్‌కు ఎలాంటి రక్షణ ప్రయోజనం ఉండదని చెప్పారు. అలాగే సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని, వేగ నియంత్రణ పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని, తమ తల్లిదండ్రులు బయటకు వెళ్లే సమయంలో కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించాలన్నారు. చివరగా రోడ్డు భద్రతపై కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి జె నరేందర్ గౌడ్ తూప్రాన్ సీఐ రంగకృష్ణ మనోహరాబాద్ ఎస్సై బి సుభాష్ గౌడ్ ఐటిసి జనరల్ మేనేజర్ ఆనంద్ జాడి, ఫ్యాక్టరీ మేనేజర్ శివం కల్రా, హెచ?ర్ మేనేజర్ నరసింహం, అడ్మిన్. మేనేజర్ సాగి సూర్య, సేఫ్టీ మేనేజర్ ఐ టి సి యాజమాన్యం కార్మికులు పాల్గొన్నారు

# స్వాతంత్ర సమరయోధుడు, యువతకు స్ఫూర్తి ప్రదాత సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని..






**పటాన్ చెరు జనవరి: 23(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని యువజన వికాస సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు ఏర్పాటు చేసిన 76 మీటర్ల జాతీయ పతాక ప్రదర్శన, ర్యాలీ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించి, సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . ఆంగ్లేయుల పాలన నుండి దేశాన్ని విముక్తి చేసిన మహోన్నత నాయకులలో సుభాష్ చంద్రబోస్ ఒకరిని అన్నారు. ఆయన జీవితం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యువజన



వికాస సమితి అధ్యక్షులు విజయ్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అశోక్, పృథ్వీరాజ్, శ్రీధర్, రుద్రారం శంకర్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించండి సురక్షితంగా గమ్యం చేరండి. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు










**మెదక్ జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
అతివేగం ప్రమాదకరం, హెల్మెంట్ వాడకం మన ప్రాణాల్ని కాపాడుతుంది. ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల పంపిణీ. చేసిన. ఎమ్మెల్యే. రవాణా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం. ప్రజలలో మంచి స్పందన. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం నుండి ఆటోనగర్ నుండి రాందాస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతపై యువతకు అవగాహన కలిగించే విధంగా అతివేగం ప్రమాదకరం హెల్మెట్ దారుణ మన ప్రాణాల్ని రక్షిస్తుంది. రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం సురక్షితంగా గమ్యాన్ని చేరదాం అనే అనే నినాదాలతో పురవీధులు మారుమోగాయి. రాందాస్ చౌరస్తా ఏరియాలో రోడ్డు భద్రత నియమాలపై. ప్రతిజ్ఞ నిర్వహించి అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ యువత వేగాన్ని నియంత్రించుకోవాలని మనిషి జీవితం చాలా విలువైందని అందులో ప్రాణం విలువ వెలు. కట్టలేనిది అన్నారు జిల్లాలో రోడ్డు ప్రమాదాలలో ఎక్కువ ద్విచక్రధ వాహనదారులే ఉన్నారని. వారు నిబంధనలు పాటించకుండా. ప్రయాణం చేయడం వల్ల విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం రవాణా శాఖ ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై సూచనలు సలహాలు ద్వారా ప్రమాదాలు కాస్త తగ్గుముఖం పట్టాయని చెప్పారు. అంతకు ముందు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణ దగ్గర. ద్విచక్ర వాహనదారులకు ఎమ్మెల్యే హెల్మెట్లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారుడు కి హెల్మెట్ తప్పనిసరి అని. చెప్పారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులు తోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ద్విచక్ర వాహన ఉన్న ఉద్యోగులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిబంధనలు తీసుకురావడం జరిగింది అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై. ప్రజలు అవగాహన పెంపొందించుకుని. వారి నిండు జీవితాన్ని ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్. నగేష్ ,అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, రవాణా శాఖ అధికారి వెంకటస్వామి. సంబంధిత పోలీస్, యంత్రాంగం పాల్గొన్నారు.

# మరో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన శివాలి

- ఇప్పటివరకు 23 గిన్నిస్ రికార్డులతో పాటు 15 అసిస్ట్, 15 యూనిక్ వరల్డ్ రికార్డులు









**పటాన్ చెరు జనవరి: 23(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థిని శివాలి జోహ్రి శ్రీవాస్తవ (స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, 2016–2020 బ్యాచ్ – సీఎస), ఆమె తల్లిదండ్రులు కవితా జోహ్రి శ్రీవాస్తవ, అనిల్ శ్రీవాస్తవలతో కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద ఓరిగామి ప్రదర్శన (4,700 కుందేళ్ళు, 3,500 తాబేళ్లు) చేసి మరో రెండు సరికొత్త గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించారు. ఈ తాజా విజయంతో, శివాలి మొత్తం 23 గిన్నిస్ వరల్డ్ రికార్డులకు చేరుకుని, మనదేశంలో అత్యధిక సంఖ్యలో గిన్నిస్ రికార్డులు కలిగి ఉన్న వ్యక్తిగా నిలిచారు.గతంలో శివాలి 21 గిన్నిస్ రికార్డులు సాధించిన విషయం విదితమే. వాటిలో 1,251 చేతితో తయారు చేసిన కాగితపు బొమ్మలు, 7,011 క్విల్డ్ పువ్వులు, 2,111 పేపర్ క్విల్డ్ బొమ్మలు, 6,132 ఓరిగారి సిట్రస్ పండ్లు, 6,500 ఓరిగామి గబ్బిలాలు, 6,001 ఓరిగామి తిమింగలాలు, 2,100 పెంగ్విన్లు, 6,132 సిట్రస్ పండ్లు, 6,001 తిమింగలాలు, 2,500 పెంగ్విన్లు, 1,993 మాపుల్ ఆకులు, 6,500 గబ్బిలాలు, 5,500 కార్లు, 3,400 డైనోసార్లు, 1,900 కుక్కలు, 3,400 నెమళ్ళు, 3,200 పందులు, 4,400 చొక్కాలు, 2,200 క్విల్డ్ బొమ్మలు, 3,200 సీల్స్, 3,400 రిబ్బన్ టైలు వంటివి ఉన్నాయి.ఇవేగాక, 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, 15 యూనిక్ వరల్డ్ రికార్డులను కూడా శివాలి సాధించి, తన అసమానమైన సృజనాత్మకత, పట్టుదల, కళ పట్ల మక్కువను ప్రదర్శిస్తోంది.గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస?ర్ వర్మ, ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ డి. మల్లికార్జునరెడ్డి, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు శివాలి అసాధారణ విజయాలన ప్రశంసించి, తెలియజేశారు.

# జాతీయ ఓటర్ దినోత్సవాలను పురస్కరించుకొని అధికారతో ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ కలెక్టరేట్ జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
జాతీయ ఓటర్ దినోత్సవాలను పురస్కరించుకొని అందులో భాగంగా శుక్రవారం రోజు మెదక్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అదనపు కలెక్టర్ నగేష్, డిఆర? భుజంగరావు జిల్లా అధికారులు కలెక్టరేట్ అన్ని విభాగాల ఉద్యోగులతో కలిసి ఆయన ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16వ జాతీయ ఓటరు దినోత్సవంలో “నా భారత్ – నా ఓటు” అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈరోజు ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 25వ తారీఖున ఓటర్ నమోదుపై ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు., నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని,ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో ఓటరు ప్రతిజ్ఞ చేయాలని, సంబంధిత ఫోటోలు, వీడియోలను ఆయా శాఖల సోషల్ మీడియా ఖాతాలలో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.ఓటరు ప్రతిజ్ఞ వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఓటరు నమోదు ప్రతిజ్ఞ చేశారు.భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల పవిత్రతను నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగిస్తామని ఇందు మూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము.ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మెదక్ టుడే MEDAK TODAY
శనివారం, 24 జనవరి 2026

# రెచ్చిపోతున్న అక్రమార్కులు..

## నిలువునా వెలుస్తున్న షెటర్స్!






**అమీన్‌పూర్ జనవరి : 23(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ జిహెచంసి పరిధిలో అక్రమ నిర్మాణాల పర్వం కొనసాగుతోంది. ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రధాన రహదారుల పక్కన షటర్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా పి.ఎన్.ఆర్ కాలనీ నుండి లాలా బాయ్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డుకు నిర్ణీత దూరం పాటించాల్సి ఉన్నప్పటికీ, అవేవీ పట్టించుకోకుండా రహదారిని ఆనుకుని షటర్లు నిర్మిస్తున్నారు. కనీస అనుమతులు లేకుండానే రాత్రికి రాత్రే పనులు పూర్తి చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడమే కాకుండా, రహదారి విస్తరణకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.ప్రధాన రహదారిపై ఇంత బహిరంగంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా జి.హెచ్.ఎం.సి మరియు మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని, అక్రమార్కులకు అధికారుల అండదండలు ఉన్నాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, పి.ఎన్.ఆర్ కాలనీ ప్రధాన రహదారిపై జరుగుతున్న అక్రమ షటర్ల నిర్మాణాలను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.





**మెదక్ కలెక్టరేట్ జనవరి 23 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి**
జిల్లాలోని మెదక్, నర్సాపూర్ తూప్రాన్, రామాయంపేట , మున్సిపాలిటీ లలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా రంగా రెడ్డి జిల్లా మేడ్చల్ మల్కాజి గిరి ,వికారాబాద్ జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మెదక్ కలెక్టరేట్ కార్యాలయం నుండి ఈ వీడియో కలెక్టర్ పాల్గొన్నారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు తెలిపారు. ఓటర్ జాబితా,పోలింగ్ కేంద్రాల జాబితా మ్యాపింగ్ చేసి ప్రచురించడం జరిగిందని తెలిపారు. వీటి వివరాలను ఇప్పటికే టీ.పోల్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఒక రౌండ్ పరిశీలించినట్లు తెలిపారు.ఆర్.ఓ ఏ.ఆర్.ఓ ల ను గుర్తించడం జరిగిందని తెలిపారు..పోలింగ్ నిర్వహణకు సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు.బ్యాలెట్ బాక్స్ లు సిద్ధంగా ఉన్నట్లు,పోలింగ్ కేంద్రాల్లోవెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ నిర్వహణకు భవనాలను పరిశీలించినట్లు తెలిపారు.జోనల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్,ఎస్.ఎస్.టి బృందాల కు మెజిస్ట్రీరియల్ అధికారాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలను సాఫీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్ , మున్సిపల్ కమిషనర్స్ పాల్గొన్నారు.

# అమీన్‌పూర్ లో'మినీ మేడారం' జాతర ఏర్పాట్ల పరిశీలన

**- భక్తులకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు:**
**అమీన్ పూర్ సి.ఐ నరేష్, ఆలయ చైర్మన్ నీలం భిక్షపతి**





**అమీన్‌పూర్ జనవరి : 23(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ జిహెచంసి పరిధిలో అత్యంత వైభవంగా జరిగే సమ్మక్క–సారక్క (మినీ మేడారం) జాతర ఏర్పాట్లను అమీన్‌పూర్ సి.ఐ నరేష్, ఆలయ చైర్మన్ నీలం భిక్షపతి తో కలిసి శుక్రవారం పరిశీలించారు. జాతర ప్రాంగణాన్ని సందర్శించి, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు భక్తుల భద్రత: జాతర జరిగే నాలుగు రోజుల్లో , భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూ లైన్లు, తాగునీరు మరియు ఇతర కనీస సౌకర్యాలను కల్పించాలని సి.ఐ సూచించారు.సీసీ కెమెరాల నిఘా: భద్రతా పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉండాలని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీకి సి.ఐ ఆదేశాలు జారీ చేశారు.వాహనాల పార్కింగ్ మరియు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. సమ్మక్క సారక్క ఆలయ చైర్మన్ నీలం భిక్షపతి మాట్లాడుతూ.. స్థానిక పోలీసుల సహకారంతో భక్తులకు అమ్మవార్ల దర్శనం సులువుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జాతరను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఓపెన్ స్కూల్ అభ్యర్థులకు గుడ్ న్యూస్ - ఇకపై వాట్సాప్ ఛానల్‌లో పాఠాలు



**(మెదక్ టుడే)** తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా చదువుకుంటున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సార్వత్రిక విద్యను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఫలితాలను మెరుగుపరిచే దిశగా వినూత్న చర్యలను చేపట్టింది. ముఖ్యంగా ఆధునిక సాంకేతికతను వినియోగించి దూరవిద్యను మరింత సులభంగా, చేరువగా మార్చే ప్రయత్నాలు అభ్యర్థుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.వాట్సాప్ ఛానల్‌తో దూరవిద్యకు కొత్త దారి : ఇప్పటివరకు ఓపెన స్కూల్? అభ్యర్థులు పాఠ్య పుస్తకాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం ప్రత్యేకంగా వాట్సాప్ ఛానల్‌ను ప్రారంభించింది. ఈ ఛానల్? ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్? అభ్యాసకులకు పాఠాలు, అభ్యాస సామగ్రి అందుబాటులోకి వస్తోంది. పుస్తకాలతో పాటు డిజిటల్ రూపంలో పాఠాలు అందడంతో అభ్యాసకులు ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా చదువుకునే అవకాశం లభించింది. దీనివల్ల సార్వత్రిక విద్య దూరంగా కాకుండా మరింత చేరువైంది.అభ్యాస దీపికలతో బలమైన పునాది : రెగ్యులర్? విద్యార్థుల మాదిరిగానే తొలిసారిగా ఓపెన్ స్కూల్ పదో తరగతి అభ్యాసకులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభ్యాస దీపికలను అందిస్తోంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ సబ్జెక్టులకు ఇవి ఇప్పటికే రూపొందించింది. ఈ దీపికలు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా, ముఖ్యాంశాలపై దృష్టి పెట్టేలా తయారు చేశారు. మిగిలిన సబ్జెక్టుల అభ్యాస దీపికలను కూడా త్వరలో అందిస్తారు. ఇవి అభ్యర్థులకు పునశ్చరణకు, పరీక్షలకు సన్నద్ధం కావడానికి ఎంతో ఉపయోగపడనున్నాయి. బేస్‌లైన్‌టెస్టులతో ఫలితాలు మెరుగుదల : ఇప్పటివరకు ఓపెన్? స్కూల్?లో చదువుతున్న అభ్యర్థులు సంవత్సరమంతా చదివి నేరుగా వార్షిక పరీక్షలు రాసేవారు. ఈ కారణంగా ఉత్తీర్ణత శాతం తగ్గుతున్నది. ఈ లోపాన్ని గుర్తించిన ప్రభుత్వం బేస్?లైన్? పరీక్షలను ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే సగానికి పైగా గడిచిన నేపథ్యంలో ఒకసారి బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇకపై వచ్చే విద్యా సంవత్సరం నుంచి సంవత్సరానికి రెండు సార్లు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. దీని ద్వారా అభ్యాసకుల స్థాయి ముందుగానే అంచనా వేసి, అవసరమైన మార్గదర్శనం అందించవచ్చు.క్రమశిక్షణతో అభ్యాసానికి ప్రోత్సాహం : ఖమ్మం జిల్లా డీఈఓ చైతన్య జైని మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు అభ్యాసకులకు ఎంతో మేలు చేస్తాయని అన్నారు. రోజూ పాఠ్యపుస్తకాలలోని పాఠాలను రెండు నుంచి మూడు పేజీల చొప్పున రాయడం ద్వారా అభ్యాసకుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని తెలిపారు. ఇలా సాధన చేసినవారు వార్షిక పరీక్షల్లో 24 పేజీల బుక్?లెట్?ను కూడా సులభంగా రాయగలుగుతారని, ఫలితంగా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే అవకాశాలు మరింత పెరుగుతాయని వివరించారు.సార్వత్రిక విద్యకు బలమైన భవిష్యత్? : రెగ్యులర్? విద్యార్థుల మాదిరిగానే ఇప్పుడు ఓపెన్‌స్కూల్ పదో తరగతి చదువుతున్నవారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభ్యాస దీపికలను అందిస్తోందని ఓపెన్? స్కూల్? ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్? కూరపాటి మంగపతిరావు తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ సబ్జెక్టులకు వీటిని రూపొందించిందని అన్నారు. ఇతర సబ్జెక్టుల అభ్యాస దీపికలనూ త్వరలోనే అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల అభ్యాసకులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. అభ్యాసకులు రోజూ పాఠ్యపుస్తకాల్లోని పాఠాలను 2, 3 పేజీల చొప్పున రాయాలని, తద్వారా వార్షిక పరీక్షల్లో 24 పేజీల బుక్?లెట్?ను సులువుగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే అవకాశం వివరించారు.

# పోటీ ప్రపంచంలో రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్‌మెంట్, సృజనాత్మకత అవసరం

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాలి దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన--2026 ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి**







**రామచంద్రపురం జనవరి : 23 (మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
పోటీ ప్రపంచంలో రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్మెంట్, సృజనాత్మకత అవసరమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.సంగారెడ్డి జిల్లా కొల్లూరు గ్రామంలోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్?లో నిర్వహించిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శన-- 2026 ముగింపు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల వైజ్ఞానిక ఆవిష్కరణల స్టాళ్లను పరిశీలించి, వాటి ఉపయోగాలు, సాంకేతిక అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి ఆలోచనా విధానం, సృజనాత్మకతను ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో మన పిల్లలు రాణించాలంటే భాషా ప్రావీణ్యం, స్కిల్ డెవలప్‌మెంట్, సృజనాత్మకత తప్పనిసరిగా అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రాథమిక విద్య నుంచి ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తూ విద్యా రంగాభివృద్ధికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో కూడిన క్వాలిటీ ఎడ్యుకేషన్, అలాగే మెరుగైన వైద్య సేవలను సామాన్యులకు ఉచితంగా అందించడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలు అందేలా వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, సూపర్ స్పెషాలిటీ సేవల కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజా వైద్యాన్ని పటిష్టం చేస్తున్నామని తెలిపారు.నర్సింగ్ వృత్తిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తోందని, నర్సింగ్ విద్యార్థులు విదేశాల్లో సేవలందించేందుకు జపనీస్, జర్మన్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నామని మంత్రి వివరించారు.విద్యార్థులు సృజనాత్మకత, స్కిల్, క్వాలిటీ, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు.ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులలో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, ఐక్యూ స్థాయిని పెంచుతాయని అన్నారు.ఈ ప్రదర్శనలోఅద్భుతమైన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులకు మంత్రి నగదు బహుమతులు, షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులను మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజి రెడ్డి, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్, ఎస్సిఆర్టి డైరెక్టర్ రమేష్, అదనపు కలెక్టర్ పాండు, గాడియం స్కూల్ సీఈఓ రామ కృష్ణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి, నిర్మల జగ్గారెడ్డి

**- ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీల ముఖ్య కార్యకర్తల సమావేశం**
**కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చిన శ్రేణులు**
**పటాన్‌చెరు గడ్డపై కాంగ్రెస్ గెలుపునకు ఐక్యమత్యమే మంత్రం**





**పటాన్‌చెరు, జనవరి :23(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
రానున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి పటాన్‌చెరు కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ముత్తంగి గ్రామంలోని పీఎసర్ గార్డెన్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇస్నాపూర్ మరియు ఇంద్రేశం మున్సిపాలిటీల ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి, టి. జి. ఐ. ఐ. సి. చైర్మన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ విజయం చారిత్రక అవసరమన్నారు. నాయకులు, కార్యకర్తలు తమ మధ్య ఉన్న చిన్న చిన్న విభేదాలను పక్కన పెట్టి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా, అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారు.టి. జి. ఐ. ఐ. సి.చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రజలకు వివరించాలన్నారు.నియోజకవర్గ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి పోలింగ్ మేనేజ్?మెంట్?లో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి బలమని, మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవడమే మన తదుపరి లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మెదక్ పార్లమెంట్ ఇంఛార్జి నీలం మధు, గాలి అనిల్ కుమార్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ కౌన్సిలర్స్, ఆలయ చైర్మన్లు మాజీ వార్డ్ మెంబర్లు, తో పాటు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..